క్లుప్తంగా

శ్మశాన వాటిక అభివృద్ధికి శ్రీకారం



రక్షణగోడ, ర్యాంప్ పనులను ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

రావికమతం : కొత్తకోట ప్రధాన శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బేతా రాజారావు దంపతుల ఆర్థిక సాయంతో ఈ పనులు జరుగుతున్నాయి. గెడ్డ ఉధృతికి తరచూ కొట్టుకుపోతున్న రహదారిని శాశ్వతంగా నిలిచేలా రూ.5 లక్షల వ్యయంతో సీసీ రక్షణగోడ, 10 అడుగుల వెడల్పుతో ర్యాంప్, రహదారితో పాటు బోరు నిర్మాణానికి గంలో భూమిపూజ చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం సీసీ రక్షణగోడ, ర్యాంప్ పనులను వైఎస్సార్‌సీపీ నాయకుడు, జెడ్పీటీసీ భర్త తలారి ఆదిమూర్తి, సర్పంచ్ కోన లోవరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు బేతా పాండు ప్రారంభించారు. బేతా రాజారావు దంపతుల ఉదారతను కొనియాడారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి పాదాలను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల : వచ్చే నెల 6న జరగనున్న మోదకొండమ్మ పండగ సందర్భంగా కోటబయలులోని సతకంపట్టు వద్ద కొలువు దీరిన మోదకొండమ్మకు ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని ఈ ప్రాంత భక్తుల విశ్వాసం. గ్రామంతో పాటు ఇతర గ్రామాలు నుంచి వచ్చిన భక్తులతో సతకంపట్టువద్ద పండగ వాతావరణం నెలకొంది.

చల్లబడిన వాతావరణం

మాకవరపాలెం : భారీ వర్షంతో వాతావరణం చల్లబడింది. మండలంలో ఆదివారం ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండటంతో ప్రజలు అల్లాడిపోయారు. ఈ నేపథ్యంలో రాత్రి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలకు ఉపశమనం లభించగా, మామిడి రైతులు ఈదురుగాలులకు ఆందోళన చెందారు.

దేవరాపల్లి-శారదానది రోడ్డుకు మోక్షం

- రూ.50 లక్షలతో 440 మీటర్ల మేర డబుల్ రోడ్డుగా విస్తరణ



దేవరాపల్లిలో రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఈర్లె అనురాధ, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి : దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలి నుంచి శారదానది వరకు రోడ్డు విస్తరణకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చొరవతో మోక్షం లభించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. ఈ రోడ్డు విస్తరణ రూ.50 లక్షలు మంజూరవడంతో, తాజాగా పనులు ప్రారంభించారు. రోడ్డు విస్తరణ పనులను ఆదివారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలి నుంచి వాలాబు వెళ్లే రహదారిలో కొబ్బరి తోట దిగువన శ్మశానవాటిక రోడ్డు వరకు 440 మీటర్ల పొడవున, 7 మీటర్ల వెడల్పుతో రోడ్డును విస్తరించనున్నట్టు వెల్లడించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ఇరుకు రోడ్డులో ప్రయాణించాలంటే ప్రజలు నరకయాతన అనుభవించేవారన్నారు. రోడ్డు విస్తరణతో ఈ రహదారి మీదుగా ప్రయాణించే వారి ఇక్కట్లు తీరనున్నట్టు పేర్కొన్నారు. ఈ రోడ్డు పనులుపూర్తయితే దేవరాపల్లితో పాటు శంభువానిపాలెం, శ్రీరామపురం, వాలాబు పంచాయతీ పరిధిలోని శివారు గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని సుమారు 150 గ్రామాల గిరిజన ప్రజలకు సైతం రహదారి సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. ఇప్పటికే నాలుగు రోడ్ల కూడలి నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పూర్తి చేయగా, తాజాగా శారదానది వరకు పనులు మొదలయ్యాయి. రోడ్డు విస్తరణకు నిధులు కేటాయించిన డిప్యూటీ సీఎంకు స్థానిక మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, కొల్లి ఈశ్వరరావు, సబ్బవరపు మాలిబాబు, గుండు రాంబాబు, పరవాడ రవి, కె.ఎస్.అప్పలనాయుడు, కలవలపల్లి నారాయణమ్మ పాల్గొన్నారు.

దేవాలయాలతో ఆధ్యాత్మికత పెంపు



చమ్మచింతలో ఆలయ పనులను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, డీఈ సైదా

నాతవరం : గ్రామాల్లో ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి అన్నారు. మండలంలోని చమ్మచింత పంచాయతీలో ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ పనులను డీఈ సైదాతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామాల్లో భక్తుల కోరిక మేరకు హిందూ దేవాలయాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయడం ఆనందదాయకమన్నారు. చాలా గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో దేవాలయాల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నట్టు తెలిపారు. తమ ప్రాంతంలో ఎవరు ఆలయ నిర్మాణానికి నిధులడిగినా ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ యుద్ధప్రాతిపాదికన మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం డీఈ సైదా మాట్లాడుతూ నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం, కొయ్యూరు మండలాల్లో 196 దేవాలయాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అయా దేవాలయాల్లో నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. 50కి పైగా దేవాలయాల పనులు తుది దశకు చేరుకున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో చమ్మచింత సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పార్కింగ్ నిబంధనలు బేఖాతరు



కృష్ణాబజార్ రోడ్డులో అన్‌లోడింగ్ చేసేందుకు రోడ్డుకు ఇరువైపులా నిలిపిన వాహనాలు

నర్సీపట్నం : పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారుల్లో ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేసి, సరకు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పాదచారులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో కృష్ణాబజార్, పాతబస్టాండ్, చింతపల్లి రోడ్డులో రద్దీ సమయంలో లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుండటంతో ఈ మార్గంలో వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. రద్దీ కలిగిన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సంస్థలు, వ్యాపార దుకాణాల వద్ద లోడింగ్, అన్‌లోడింగ్ చేసేందుకు లారీలు, పెద్ద వాహనాలకు ప్రత్యేక సమయమిచ్చారు. అర్ధరాత్రి నుంచి వేకువ జాము వరకు వీరికి కేటాయించిన సమయాల్లో కార్యకలాపాలు ముగించాలి. అయితే ఎక్కడా అలా జరగడం లేదు. ఎవరికి నచ్చిన సమయంలో వారు, రోడ్డుపై భారీ సరకు వాహనాలను నిలిపి, ట్రాఫిక్ ఇక్కట్లకు కారకులవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా భారీ లారీలను నిలిపేయడంతో ద్విచక్ర వాహనాల రాకపోకలకు కూడా వీల్లేకుండా పోతోందని స్థానికులు గగ్గోలుపెడుతున్నారు. ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జఠిలమవుతున్నా పోలీసులు పట్టించుకోవట్లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై లారీలు ఇష్టారాజ్యంగా నిలపకుండా, కేటాయించిన సమయాల్లోనే వాహనాలను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

చిన్నారులకు యోగాలో శిక్షణ



యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

నర్సీపట్నం : స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా ఆదివారం చిన్నారులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. యోగా టీచర్ ఎం.రాజ్యలక్ష్మి పలు యోగాసనాలను నేర్పించారు. యోగా చేయటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉంటామని విద్యార్థులకు వివరించారు. అనంతరం గ్రంథాలయ అధికారిణి పి.దమయంతి పిల్లల చేత కథలు చదివించి అందులోని నీతిని వివరించారు. పిల్లలచే రిక్రియేషన్ గేమ్ ఆడించారు. ఈ గేమ్ ద్వారా ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చన్నారు. శిక్షణ అనంతరం చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ పి.ప్రభాకర్, అధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

సండే.. ఎండలు మండే!

కె.కోటపాడు : అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు రోడ్లపైకి రావాలంటే భయాందోళనలకు గురవుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటున్నాయి. గత 10 రోజులుగా ఎండల తీవ్రత మరింత ఎక్కువ కావడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం మండల గ్రామాల్లో ప్రధాన కూడళ్లు మధ్యాహ్న సమయంలో వాహనాల రాకపోకల్లేక నిర్మానుష్యంగా మారాయి. పగటి సమయంలోఎండల తీవ్రత దృష్ట్యా అత్యవసరమైతే తప్ప ప్రజలు రోడ్లపైకి రావొద్దంటూ ఇప్పటికే అధికారిక హెచ్చరికలున్నాయి. దీంతో చాలా వరకు ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు.

ముగిసిన తైక్వాండో శిక్షణ

- ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసాలు



విద్యార్థులకు బహుమతులందిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట : మండలంలోని మేజర్ పంచాయతీ వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన తైక్వాండో ఉచిత శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వడ్డాదికి చెందిన అమ్మ హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ మే 5 నుంచి 20 వరకు తైక్వాండోలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 5 నుంచి 16 ఏళ్ల వయసున్న విద్యార్థులకు రోజూ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు తైక్వాండోలో మెలకువలను నేర్పారు. బుచ్చెయ్యపేట, మాడుగుల, చీడికాడ, చోడవరం, రావికమతం తదితర మండలాలకు చెందిన పలువురు విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొని సద్వినియోగం చేసుకున్నారు. సాయంత్రం తైక్వాండోలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పలువురు నాయకులు కార్యక్రమంలో పాల్గొని శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేసిన అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సేవా సంస్థ ప్రతినిధులను అభినందించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

రావికమతం : కొత్తకోట సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ సురేష్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జె.నాయుడుపాలెం ఫీడర్, బ్రేకర్స్ మరమ్మతులు, సబ్‌స్టేషన్ అప్‌గ్రేడేషన్ పనుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు వెల్లడించారు. ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

మోదకొండమ్మకు వెండి పాదాలు



కె.జె.పురంలో వెండిపాదాలను ఊరేగిస్తున్న యల్లపు త్రినాథ్ కుటుంబ సభ్యులు

మాడుగుల రూరల్ : కె.జె.పురం మోదకొండమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన యల్లపు త్రినాథ్, మౌనిక కుటుంబ సభ్యులు రెండున్నర కిలోల వెండితో తయారు చేసిన పాదాలను ఆదివారం ప్రతిష్ఠించారు. వీటి విలువ సుమారు రూ.2.30 లక్షలు. ముందుగా వెండి పాదాలను పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు, నాయకులు ఆడారి కన్నారావు, యల్లపు శ్రీను, జగ్గప్పారావు, అచ్చిమినాయుడు, ఆడారి సన్యాసినాయుడు, సురేష్, కాళ్ల అమ్మతల్లినాయుడు, ఆడారి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

రావికమతం : మరుపాక మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సత్య సునీల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదోతరగతి పాసైన వారు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. http:// apms. apcfss. in, http:// cse. ap. gov. in వెబ్‌సైట్ల ద్వారా ఈ నెల 22 నుంచి జూన్ 7 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200 ఫీజు చెల్లించాలన్నారు.

ఏపీజీవీబీలో డిపాజిట్లపై అధిక వడ్డీ

మాడుగుల రూరల్ : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ అందిస్తున్నట్టు కేజే పురం బ్రాంచ్ మేనేజర్ ఎస్.సాయిసుధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడారు. సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై వికాస్ 777తో 8 శాతం, వికాస్ 444తో 7.6 శాతం వడ్డీ లభిస్తుందన్నారు. ఈ అవకాశం ఈ ఏడాది జూన్ వరకు మాత్రమే ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జన సురక్ష బీమా పథకంలో అర్హత కలిగిన బ్యాంక్ ఖాతాదారు ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లిస్తే 50 ఏళ్ల వయసులోపు సహజ మరణం సంభవిస్తే రూ.2 లక్షలు నామినీకి వస్తుందన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనలో ఏడాదికి రూ.20 చెల్లిస్తే ఖాతాదారుడు ప్రమాదవశాత్తూ 70 ఏళ్లలోపు మరణిస్తే రూ.2 లక్షల నామినీకి బీమా భరోసా లభిస్తుందన్నారు. వ్యవసాయ, స్వయం సహాయక రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించి, బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని ఖాతాదారులను కోరారు.

జి.కొత్తపల్లిలో 'గడప గడపకు' నేడు

చీడికాడ : మండలంలోని జి.కొత్తపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ప్రారంభంకానున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరుకానున్నట్టు వెల్లడించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించడంతోపాటు, స్థానిక సమస్యల్ని తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. మండలంలోని పార్టీ సర్పంచ్‌లు, నేతలు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, సచివాలయాల కన్వీనర్లు హాజరుకావాల్సిందిగా కోరారు.




అ'పూర్వ' సమ్మేళనం



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం : సరిగ్గా 26 ఏళ్ల క్రితం వారంతా డిగ్రీ పూర్తి చేశారు. కొందరు మరింత ఉన్నత చదువులకు వెళితే.. చాలా మంది ఆ డిగ్రీతోనే బతుకు పుస్తకాన్ని దిగ్విజయంగా ప్రారంభించారు. ప్రస్తుతం కొడుకులు, కూతుళ్లున్న వయసుకొచ్చేశారు. అలాంటి వారి అపూర్వ కలయికకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా మారింది. 1997లో డిగ్రీ పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా తమ బతుకు జీవితానికి దారి చూపిన చదువులమ్మ ఒడిలో కలుసుకోవడంతో కళాశాలలో పండగ వాతావరణం నెలకొంది. కళాశాల జీవితంలోని తీపిజ్ఞాపకాలను, చిలిపి అల్లర్లను నెమరువేసుకున్నారు. అప్పటి సంఘటనల్ని గుర్తు చేసుకుంటూ ఒకర్ని ఒకరు ఆటపట్టించుకోవడంతో నవ్వులు వెల్లివిరిశాయి. అప్పట్లో తమకు విద్యను అందించిన ప్రస్తుత విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ కుమార్‌బాబు పాల్గొని, ఏడాదికోసారి ఆత్మీయంగా కలుసుకుంటూ, ఒకరికొకరు సహాయం చేసుకుంటూ ఆనందంగా జీవించాలని అభిలషించారు. అధ్యాపకులు రాంబాబు, రామును పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాలలో గడిపి, ఆ ఆనంద క్షణాలను పదిలపరచుకున్నారు.

కోలాటం కళాకారులకు చీరల వితరణ



కోలాటం మహిళలకు చీరలను అందిస్తున్న రామునాయుడు

కె.కోటపాడు : సూదివలస గ్రామంలో కోలాటం కళాకారులైన మహిళలకు ఎంపీటీసీ వర్రి రామునాయుడు తన సొంత నగదుతో ఏకరూపు చీరలను సమకూర్చారు. ఆదివారం గ్రామంలో కోలాటం గ్రూపులకు చెందిన 30 మంది మహిళలకు వీటిని అందించారు. కోలాటం ప్రదర్శనలతో మహిళలు ప్రజల్లో భక్తిభావాన్ని మరింతగా పెంపొందించాలని సూచించారు. ఈ చీరల కొనుగోలుకు రూ.20 వేల నగదు వెచ్చించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వర్రి కొండబాబు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'



మండల అధ్యక్షుడు పైల పోతురాజు

నాతవరం : మండలంలో సోమవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభం కానున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైల పోతురాజు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నెల 22న ఎంబీ పట్నం, 23, 24 తేదీల్లో లింగంపేట, 25న వీబీ అగ్రహారం, 26న వల్సంపేట, 27న సరుగుడు, 28న సుందరకోట పంచాయతీలో ఎమ్మెల్యే పర్యటించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతోపాటు, స్థానిక సమస్యల్ని ఆరా తీసి, తక్షణ పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

గణేష్ గాయత్రి బ్రాహ్మణ సంఘ కార్యవర్గం ఎన్నిక

చోడవరం : స్థానిక శ్రీగణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం భవనంలో నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా శ్యామ్‌ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కొమ్మనమంచి నర్సింహమూర్తి, ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, కార్యదర్శిగా వింజమూరి గౌరీశంకర్, సంయుక్త కార్యదర్శిగా జగన్నాథరావు, కన్వీనర్‌గా కందర్ప కృష్ణమూర్తి ఎన్నికయ్యారు.

350 మందికి వైద్య సేవలు

దేవరాపల్లి : గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు వైద్య శిబిరాల ద్వారా ప్రముఖ వైద్య నిపుణులతో మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ అన్నారు. దేవరాపల్లిలో వెంకటేశ్వర మెడికల్ సెంటర్, ఆదర్శ మండల వినియోగదారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఈర్లె అనురాధ కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో గైనకాలజీ, డెర్మటాలజీ, ఆర్థోపెడిక్, డయాబెటిక్, కంటి, సాధారణ వైద్య నిపుణులు పాల్గొని 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచిత మందులు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, నాయకులు కొల్లి ఈశ్వరరావు, బి.కె.నాయుడు, బి.త్రినాథ్‌రాజు, కొట్టాన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

చోడవరం : చోడవరం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జోన్‌స్థాయి షటిల్, చెస్ పోటీలు నిర్వహించారు. చదరంగంలో గుండా గోవర్ధన్, టి.లత, టీఎస్ఎస్ గుప్తా, షటిల్ పోటీల్లో కె.మల్లేశ్వరరావు, సతీష్‌కుమార్, సోమరాజు జట్లు గెలుపొందాయి. వీరికి వాసవీక్లబ్ జిల్లా గవర్నర్ పీఎస్ వరహాలరావు బహుమతులు అందజేశారు.







